క్లుప్తంగా

చెరువు మట్టి పనుల ప్రారంభం



ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించిన సర్పంచ్ దేవి వెంకటరమణ

పరవాడ: తానాం గ్రామంలో దుంగలవాని చెరువులో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు ప్రభుత్వం రూ.10 లక్షల మంజూరు చేసిందని సర్పంచ్ కన్నూరిదేవివెంకటరమణ చెప్పారు. మంజూరైన నిధులతో చెరువులో చేపట్టిన మట్టి పనులను గురువారం ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మివసంతరావు, నాయకులు పైల లలిత దేముడు బాబు, చీపురుపల్లి కృష్ణవేణి, జి.సన్యాసినాయుడు, ఆర్.లక్ష్మిదేవి, ఆర్.రమ్య, జి.సతీష్, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని ఉడా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్-బి జోన్, సప్తగిరినగర్, హస్మినగర్, గ్యాస్ గొడౌన్, గణేష్నగర్, బ్యాంక్ కాలనీ, ఉడా కాలనీ, రైలు విహార్ కాలనీ, వీరా నగర్, అంబేడ్కర్నగర్, చినముషిడివాడ పార్ట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.
రాంపురం ఫీడర్ పరిధి ప్రసాద్నగర్, శ్రమశక్తినగర్-3, 4, లాస్ట్ బస్టాప్, బంగారమ్మకాలనీ, సత్యనగర్, చినముషిడివాడ పార్ట్ ప్రాంతాలు, సతివానిపాలెం ఫీడర్ పరిధిలోని సతివానిపాలెం, కోటనరవ, ఎంఈఎస్ కాలనీ, అహ్మద్నగర్ తదితర ప్రాంతాల్లో కూడా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పరవాడలో...

పరవాడ: దేశపాత్రునిపాలెం ప్రాంతంలో ఏపీ ట్రాన్స్కో విద్యుత్ లైన్లలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని కశింకోట ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. అలాగే పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్స్టేషన్ల పరిధిలో చేపట్టనున్న విద్యుత్ పరమైన సమస్యల నేపథ్యంలో శుక్రవారం ఉయదం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం ముత్యాలమ్మపాలెం, దలాయిఆపలెం, దోసూరు, నునపర్తి, రావాడ, పరవాడ, భర్నికం, తానాం, ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, జాజులవానిపాలెం, దేశపాత్రునిపాలెం, పి.బోనంగి, కలపాక, వెన్నలపాలెం పంచాయతీలు, శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన నోట్ పుస్తకాలను కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి చేతులమీదుగా గురువారం కళాశాల విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులంతా నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ బి సత్యవతి, అధ్యాపకులు జే.వివేకనందరావు, ఎ.జనార్దన్, పి.సుభాషిణి, పి.సూర్యశ్రీ, కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

19న పరవాడ మండల సమావేశం

పరవాడ: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు పరవాడలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని విభాగాల అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

తల్లుల ఆశలపై నీళ్లు



స్కూల్కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామన్న ప్రకటన ఇది..

ఎన్నికల ముందు ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. పథకం విధివిధానాల ప్రకారం.. ఒక్కో తల్లికి రూ.15,000 మాత్రమే ఆర్థిక సహాయం అంటూ మెలిక పెట్టారు. జీవో 29 ప్రకారం ఒక ఇంట్లో ఆధార్ కార్డు ఆధారంగా (ఆధార్ లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని.. అది వచ్చేలోపు పది రకాల కార్డులను అనుమతిస్తామని చెప్పారు) అమ్మలకు తల్లికి వందనం వర్తింపజేయనున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. అంటే ఒక ఇంటికి రూ.15వేలు.. ఇంట్లో ఒక్కరికే వర్తింపజేయడమన్నమాట. అలాగే.. వైట్ రేషన్కార్డు లబ్ధిదారులకే పథకం వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఇంతకు ముందు వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం చేసింది కూడా ఇదే కదా... కాకపోతే ఇప్పుడు ఆధార్ కార్డును తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా పేర్కొనడంతో పాటు విద్యార్థికి 75 శాతం హాజరు తప్పనిసరి, పేదరికం, దారిద్ర్య రేఖకు దిగువన లాంటి అంశాల్ని ప్రామాణికంగా తీసుకుంటామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ పథకం అమలుపై ఎంతో ఆతృతగా ఎదురుచూసిన తల్లిదండ్రుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలతో గందరగోళం నెలకొనగా, రానున్న రోజుల్లో ఇది లబ్ధిదారులకు కోత పెట్టే చంద్రబాబు మాయేనన్న చర్చ మరోవైపు నడుస్తోంది.

–పరవాడ, సబ్బవరం

హామీ నిలబెట్టుకోవాలి



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. నా భర్త పదేళ్ల క్రితం ప్రమాదంలో చనిపోయారు. పశు పోషణ చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. పిల్లల్ని ప్రైవేట్ స్కూల్లో చదివించుకునే ఆర్థిక స్థోమత లేదు. దీంతో సబ్బవరం కేజీబీవీలో పిల్లల్ని చదివిస్తున్నా. పెద్దమ్మాయి గీతిక పదోతరగతి, చిన్నది దివ్య 9వ తరగతి చదువుతున్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి వచ్చేది. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం లబ్ధి అందించాలని కోరుతున్నా.

–నక్కెళ్ల సన్యాసమ్మ, రాయపుర అగ్రహారం, సబ్బవరం

పిల్లలందరికీ అమలు చేయాలి



నా భర్త కశిరెడ్డి అప్పలరాజు, ఇద్దరి కుమార్తెలతో పరవాడలో నివాసం ఉంటున్నాం. మా పెద్ద కుమార్తె అంజనాశ్రీ యోగిత మధురవాడ శ్రీవిశ్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. రెండో కుమార్తె పల్లవి రవిత్రయని ఉక్కునగరంలోని డీపీఎస్ స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద చిన్న కుమార్తెకు రూ.15 వేలు వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా ఇద్దరు కుమార్తెలకు తల్లికి వందనం పథకంలో లబ్ధి చేకూరుతుందని ఆశించాం. కానీ ప్రభుత్వం తల్లికి వందనం పథకం జీవోలో ఒకరికి మాత్రమే అమలు చేస్తామనడం అన్యాయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిల్లలందరికీ వర్తింపజేయాలి.

– కశిరెడ్డి యశోద, గృహిణి, పరవాడ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణపుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదిత ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

పెండింగ్ గౌరవ వేతనాల కోసం వలంటీర్ల ఆందోళన

- పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పరిష్కరిస్తానన్న ఎంపీపీ బోకం సూర్యకుమారి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించిన గ్రామ వలంటీర్లు

సబ్బవరం: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/వార్డు వలంటీర్లకు జూన్ నెల వరకూ గౌరవ వేతనాలు చెల్లించారు. సబ్బవరం మండలంలో మాత్రం పంచాయతీ కార్యదర్శుల నిర్వాకంతో వలంటీర్ల గౌరవ వేతనాలు అందలేదు. దీంతో వలంటీర్లు నిరసన బాట పట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేరి పెండింగ్ గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలంటే ఆందోళనకు దిగారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలోని పనిచేసిన సుమారు 360 మంది వలంటీర్లకు 3 నెలల గౌరవ వేతనం చెల్లించలేదని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వంతో సంబంధం లేకుండా వలంటీర్ల గౌరవ వేతనాన్ని నిలిపి, వారిని ఆర్థికంగా దెబ్బతీశారని పేర్కొన్నారు. గురువారం గ్రామ సచివాలయాల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయగా, సీఎం పర్యటన నేపథ్యంలో వారంతా బిజీగా ఉండటంతో శుక్రవారానికి వాయిదా వేశామన్నారు. వలంటీర్ల గౌరవ వేతనం నిలిపేయడానికి కారణాలపై వలంటీర్ల సమక్షంలోనే కార్యదర్శులను నిలదీయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుల్లేపల్లి సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ వల్లే మిగిలిన పంచాయతీ కార్యదర్శులు కూడా తమకు రావాల్సిన గౌరవ వేతనాన్ని నిలిపి, ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారని వలంటీర్లు ఆరోపించారు. ఎంపీపీ హామీతో మళ్లీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చేందుకు నిర్ణయించుకుని, వలంటీర్లు ఆందోళన విరమించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- సీజీఆర్ఎఫ్ సదస్సులో వేదిక చైర్పర్సన్ సత్యనారాయణ



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్పర్సన్ సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) పనిచేస్తుందని సంస్థ చైర్పర్సన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. సబ్బవరంలోని ఏపీఈపీడీసీఎల్ సబ్స్టేషన్ సెక్షన్-2 కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యల నివేదనకు టోల్ ఫ్రీ నెం.1912ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమస్య పరిష్కారానికి నోచుకోకపోతే వినియోగదారులు తమ(సీజీఆర్ఎఫ్)కు నివేదించవచ్చన్నారు. ఉత్తరాల ద్వారా, ఫోన్ కాల్, వాట్సాప్ సందేశం ద్వారా ఫిర్యాదు చేసినా వెంటనే పరిష్కార మార్గం చూపుతామన్నారు. విద్యుత్ బిల్లుల అవకతవకలు, మీటర్లు పనిచేయకపోవడం, విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వ్యవహార శైలిపై కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ న్యాయస్థానం 2005 నుండి పూర్తిస్థాయిలో పనిచేస్తోందని, వినియోగదారులలో అవగాహన లేకపోవడం వలనే ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. 2005 నుంచి ఇప్పటివరకూ 8,027 ఫిర్యాదులు తమకు రాగా అందులో 7,905 పరిష్కరించామని, 122 మాత్రమే పెండింగ్లో ఉన్నట్లు వెల్లడించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యను గరిష్టంగా 60 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులకు అవగాహన కలిగించేందుకు జిల్లాలు, డివిజన్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరంలో ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల్ని స్వీకరించారు. కార్యక్రమంలో వేదిక ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్ర కుమార్, ఈపీడీసీఎల్ కశింకోట డీఈ రామకృష్ణ, సబ్బవరం ఏడీఈ బి.నిరీక్షణ్ అంబేడ్కర్, ఏఈలు బి.వీరేంద్ర, జి.అశోక్, ఏఏవో ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ నుంచి గంభీరానికి సిటీ బస్సు సౌకర్యం

దాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ గంభీరానికి రూట్ నంబరు 25-ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరుకుంటుందని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం..
ఉదయం 07:30, 10:20
మధ్యాహ్నం ఒంటిగంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:
ఉదయం 08:55, 11:35,
మధ్యాహ్నం 14.30, 18:15

సింహాచలం రైల్వేస్టేషన్లో ఆర్పీఎఫ్ మాక్డ్రిల్



రైల్వే స్టేషన్లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం మాక్డ్రిల్ నిర్వహించారు. రైల్వే స్టేషన్లో సంఘ విద్రోహ శక్తులు దాడులు చేయకుండా ముందుగా ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న కోణంలో డ్రిల్ చేశారు. రైల్వే స్టేషన్లోకి వెళ్లే మార్గంలో ప్రతీ వ్యక్తిని నిశితంగా పరిశీలించారు. వారి బ్యాగులు చెక్ చేసి లోపలికి పంపించారు. ప్లాట్ఫారాలపై, చంద్రగనర్ వైపు ప్రత్యేక నిఘా పెట్టారు. చివిరికి స్టేషన్లో బాంబ్ పెట్టేందుకు యత్నించిన వ్యక్తులను పట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు, డాగ్స్క్వాడ్ విభాగం, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ పంటలతో రైతులకు చక్కటి ఆదాయం



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి సోని

పెందుర్తి: సీజనల్ వాణిజ్య పంటలు పండించడం వలన రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని ఉద్యాన శాఖ అధికారి జి.సోని అన్నారు. స్థానిక రైతు బజార్లో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బజార్లకు వినియోగదారుల సంఖ్య పెరుగుతుందన్నందున ప్రజలకు మేలు రకం కాయగూరలు, ఆకుకూరలు అందించేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. సీజనల్ పంటలు అందుబాటులో ఉంటే రైతులతో పాటు వినియోగదారులకు కూడా మేలు చేకూరుతుందన్నారు. రైతు బజార్ ఈవో శర్మిల పలు అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పనిదినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు. జిల్లాలో రెండో శనివారం, లేదా ఆదివారం రోజుల్లో ఎక్కడైనా స్కూళ్లు తెరిచి, తరగతులు నిర్వహించినట్లెతై తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎస్బీసీ బ్రిడ్జి మీదుగా వాహనాలను అనుమతించాలి



మల్కాపురం బస్టాప్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ప్రత్యామ్నాయం చూపకుండా ఎస్బీసీ వద్ద గల డాక్యార్డ్ బ్రిడ్జిని మూసివేస్తామనడం సరి కాదని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నేవల్ డాక్యార్డ్ పక్కన గల షిప్ బిల్డింగ్ సెంటర్(ఎస్బీసీ)కు అతి సమీపాన గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేయాలని అధికారులు చూస్తున్నారు. దీనిలో భాగంగా బ్రిడ్జికి మరమ్మతుల చేసేందుకు దానిపై నుంచి ఎటువంటి వాహనాలను అనుమతించమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై సీపీఎం నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మల్కాపురం బస్స్టాప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ డాక్యార్డ్ వద్ద గల వంతెనకు మరమ్మతులు చేయడం మంచిదే కానీ.. ఇటుగా వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఆకస్మాతుగా ఇలాంటి నిర్ణయం తీసుకుంటే వాహనదారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాలవాసులు, ఉద్యోగులు, విద్యార్థులు అటు నగరంలోకి.. ఇటు డాక్యార్డ్, ఎస్బీసీ, ఎస్ఆర్ వంటి పరిశ్రమలకు నిత్యం ఈ వంతెన మీదగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు ఈ బ్రిడ్జిని మూసివేస్తే సమయం వృథా కావడంతోపాటు వారికి ఇబ్బందులు తప్పవని చెప్పారు. అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకి విరాళం చెక్కు అందిస్తున్న హేమలత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని సీబీఐ కాంపౌండ్కి చెందిన హేమలత గురువారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావుకి అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఉజ్వల భవిష్యత్



బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రవీంద్ర నాయక్

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో గురువారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రవీంద్ర నాయక్ మాట్లాడుతూ బాలికా విద్య, సీజనల్ వ్యాధులపై వివరించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. అనంతరం కళాజాత టీమ్కు చెందిన ఎం.బాలాజీ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు పద్మజ, ఆకుల అభిన్, మోనిషా, అనూష పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

- ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ఇమంది శ్రావణి



ఎల్.సోమశేఖర్



బి.దుర్గాప్రసాద్



బి.ఈశ్వర్చరణ్



ఎమ్.జగన్



ఆర్.శ్రీహరి



కె.రోహిత్ కుమార్



సీహెచ్ మహేష్



జి.రమేష్



పి.అజయ్కారుణ్య



కె.వరహాలుదొర



ఎస్.సోముశేఖర్



శీలంశెట్టి విజయదుర్గ



దాలిబోయిన హనిశ్రీ



ఉగ్గిన పూజిత



గొంప సాయి సింధు



కూంద్రపు చాందిని



దూడ రఘు



పి.జయవర్ధన్



బి.అమృతవర్షిణి



హర్షశివసాయివర్ధన్

సింహాచలం : అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 2023-24 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన ఇమంది శ్రావణి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు సోమవారం తెలిపారు. శ్రావణి 581 మార్కులు సాధించి పాఠశాల టాపర్గా నిలిచిందని పేర్కొన్నారు.

అడవివరంలో ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బాలుర వెనుగబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యనభ్యసించిన 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందినట్టు ప్రిన్సిపాల్ డి. సత్యారావు గురువారం తెలిపారు. విద్యార్థులు ఎల్. సోమశేఖర్(585), బి.దుర్గాప్రసాద్ (584), బి.ఈశ్వర్చరణ్ (583), ఎం.జగన్ (583), ఆర్.శ్రీహరి (582) న్యూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. అలాగే కె.రోహిత్కుమార్ (575), సిహెచ్.మహేష్ (575), జి.రమేష్(573), పి.అజయ్కారుణ్య (562), కె.వరహాలుదొర (557) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. అలాగే ఎస్.సోముశేఖర్ (571) ఒంగోలు ట్రిపుల్ఐటీలో సీటు సాధించారని తెలిపారు.

పరవాడ: మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి, పరవాడ జెడ్పీ పాఠశాలలు, లంకెలపాలెం, పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలల నుంచి 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పరవాడ ఎంఈవో ఎం.దివాకర్రావు చెప్పారు. పెదముషిడివాడ జెడ్పీ పాఠశాల నుంచి శీలంశెట్టి విజయదుర్గ (శ్రీకాకుళం), దాలిబోయిన హనిశ్రీ(శ్రీకాకుళం), ఉగ్గిన పూజిత(ఒంగోలు), గొంప సాయి సింధు (నూజివీడు), వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల నుంచి కూంద్రపు సాంధిని (ఒంగోలు), దూడ రఘు (నూజివీడు), పరవాడ బాలుర జెడ్పీ పాఠశాల నుంచి పి.జయవర్ధన్ (నూజివీడు), పరవాడ బాలికల జెడ్పీ పాఠశాల నుంచి బి.అమృతవర్షిణి (ఒంగోలు), లంకెలపాలెం జెడ్పీ పాఠశాల నుంచి జి.హర్ష శివ సాయి వర్ధన్ (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని ఎంఈవో వివరించారు.

పాఠశాల నిర్వహణలో అలసత్వం వద్దు

మధురవాడ : పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ విషయంలో అలసత్వం తగదని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, క్రమశిక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు.